క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 40, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 150.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ప్రత్యేక 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌కు సన్మానం ఉంటుంది. అనంతరం 'టు వర్డ్స్ ఏ ప్రొగ్రెసివ్ లైఫ్' అనే అంశంపై బి.కె.కుల్‌దీప్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. తదనంతరం యోగాసనాలపై సెలెబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ నిఖీ సింగ్ అవగాహన కల్పిస్తారు.

గోకుల్ ప్లాట్స్‌లో 'మిల్లెట్స్ రుచులు'

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో మిల్లెట్స్ రుచులు టిఫిన్ సెంటర్‌ను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు గుమ్మడి శ్రీనివాస్, పితాని శ్రీనివాస్, దుర్గారావు, రఘునాథ్, పితాని లక్ష్మీ, అనిల్, లక్ష్మి పాల్గొన్నారు.

'బిన్నూ'లో రియల్ మీ 11ప్రో+ గ్రాండ్ విడుదల



రియల్‌మీ 11ప్రో + గ్రాండ్‌ను విడుదల చేసిన నటి వర్ష బొల్లమ్మ , సంస్థ ప్రతినిధులు

మాదాపూర్: మొబైల్స్ అంటే ఎంతో ఇష్టమని సినీ నటి వర్ష బొల్లమ్మ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని బిన్నూ మొబైల్, ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో గురువారం రియల్‌మీ 11ప్రో ప్లస్ గ్రాండ్‌ను సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయినితేష్, రియల్‌మీ సౌత్‌ఇండియా సేల్స్ హెడ్ వేణు మాధవ్‌లతో కలిసి వర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రియల్‌మీ 11ప్రో+ అత్యుత్తమ స్మార్ట్‌ఫోన్ అని అన్నారు. వీటి ప్రారంభ ధర రూ.23,999, రూ.24,999, రూ.27,999లో అందుబాటులో ఉన్నాయన్నారు.

సెల్‌బేలో నటి కుషిత..



గచ్చిబౌలి: సెల్‌బే షోరూమ్‌లో నటి కుషిత కల్లపు గురువారం సందడి చేశారు. గచ్చిబౌలిలోని సెల్ బే స్టోర్‌లో రియల్‌మి 11 ప్రొ 5జీ సిరీస్ స్మార్ట్ ఫోన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో సెల్ బే ఎండి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ సుహస్, వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

యానిమల్ హెల్త్ వెట్ క్లీనిక్ ప్రారంభం



క్లీనిక్‌ను ప్రారంభించిన చేవెళ్ళ ఎంపీ డా.రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల హుడా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన యానిమల్ హెల్త్ వెట్ క్లీనిక్‌ను చేవెళ్ళ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుక్కల సంరక్షణ కోసం క్లీనిక్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెల్త్ వెట్ క్లీనిక్ ఎండీ డాక్టర్ రాఘవేందర్, డా. రంజిత్ కుమార్, డా.లహరి, బీఆర్‌ఎస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, శ్రీను పటేల్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నిజాంపేట్: నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మితమై 41 రోజులు పూర్తయిన నేపథ్యంలో మండల పూజ, హోమం, అభిషేకం చేశారు. మేయర్ నీలారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా మేయర్ పూజారులకు నూతన వస్త్రాలు, కానుకలను అందజేశారు.

ఇక వార్డు కార్యాలయాల పరిపాలన

నేటి నుంచి ప్రారంభం

గచ్చిబౌలి: పాలనా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు.. పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంగా వార్డు కార్యాలయాలను శుక్రవారం అన్ని డివిజన్లలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో వార్డు కార్యాలయాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లు, చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలో ప్రత్యేకంగా వార్డు కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అందుబాటులో ఉండే అధికారులు వీరే....

- వార్డు కార్యాలయాలు ప్రతి డివిజన్‌లో ఒకటి ఏర్పాటు చేస్తారు. వీటికి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారిని వార్డు ఆఫీసర్‌గా నియమించారు.
- వార్డు ఆఫీసర్ పర్యవేక్షణలో పారిశుద్ధ్యం, రోడ్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, యూబీడీ, యూసీడీ, జలమండలి, ట్రాన్స్‌కో(విద్యుత్) ఇతర విభాగాల నుంచి తీసుకోబడిన ఉద్యోగులను ప్రతి వార్డు కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరించడానికి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు నియమించబడ్డారు.
- ఈ అధికారులు వార్డు స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును కూడా పర్యవేక్షిస్తారు. అంతేకాకుండా ఫిర్యాదుల నమోదు..కంప్యూటర్ ఆపరేటర్ కూడా అందుబాటులో ఉంటారు.

శేరిలింగంపల్లిలో ఎమ్మెల్యే ప్రారంభించనున్న వార్డు కార్యాలయాలు ఇవే....

- గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలో శుక్రవారం ఉదయం 9 గంటలకు వార్డు కార్యాలయం ప్రారంభం.
- ఆల్విన్‌కాలనీ పరిధిలోని షంషీగూడలో..
- వివేకానందనగర్ పరిధిలోని బాగ్ అమీర్‌లో ఉదయం11గంటలకు వార్డు కార్యాలయం ప్రారంభం

ప్రజలకు పాలన చేరువ చేయడమే లక్ష్యం



పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో ఒక వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని నియమించారు. మంత్రి కేటీఆర్ ఆలోచనలను అనుగుణంగా విప్లవాత్మకమైన నిర్ణయంతో ఈ నూతన వ్యవస్థ అందుబాటు లోకి వస్తోంది. శుక్రవారం నుంచి ఈ వార్డు కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను ప్రజలు త్వరితగతిన పరిష్కరించుకోవాలి.

– శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: కాలనీల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనుపటేల్, తిరుమలేష్, గుల్‌మొహర్ పార్కు కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, ప్రతినిధులు వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో..

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయిప్రశాంత్‌నగర్, ఆదిత్యనగర్, జై భారత్‌నగర్, హైదర్‌నగర్ కాలనీల్లో 1 కోటి 93 లక్షల 40 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

● కార్పొరేటర్ హమీద్ పటేల్



ప్రేమ్‌నగర్ ఏ బ్లాక్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ హమీద్ పటేల్

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని కార్పొరేటర్ హమీద్ పటేల్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ ఏ బ్లాక్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రూ.1.20 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. వీధుల్లో తిరుగుతూ స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీల్లో ఎత్తుగా ఉన్న ప్రాంతాలకు మంచి నీళ్ళు రావడం లేదని స్థానికుల ఆయన దృష్టికి తీసుకురాగా వాటర్ బూస్టర్ ద్వారా వాల్వ్‌లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. వీధి దీపాలు స్తంభాలు, విద్యుత్ సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ ఉస్మాన్, షేక్ ఇమామ్, గిరి గౌడ్, సయ్యద్ అమీనుద్దీన్, జహీర్, షేక్ ఫరీఫ్, వహీద్ అలీ, జహంగీర్, అభి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 11 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.

చిట్కుల్‌లో పల్లె ప్రగతి దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిట్కుల్ గ్రామంలో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు.గ్రామ పంచాయతీలో జెండా ఎగరవేసి చిట్కుల్ గ్రామంలో చేసిన అభివృద్ధిపై పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రామారావు, నీలం మధు ముదిరాజ్ ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అదేవిధంగా ఉత్తమ గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలు, శానిటేషన్ కిట్లు ఇచ్చారు.

గృహ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

పటాన్‌చెరు టౌన్: గృహ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని గృహ కార్మికుల యూనియన్ డైరెక్టర్ సిస్టర్ జెస్సీమేరీ, ఫీల్డ్ కోఆర్డినేటర్లు పద్మావతి, సుజాత అన్నారు. గురువారం పట్టణంలో గృహ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ కార్మికులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వారికి సంక్షేమ బోర్డు, సమగ్ర చట్టం, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, వారానికి ఒక రోజు సెలవు, గృహ కార్మికులను గుర్తించి అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం పట్టణాల పరిధిలో ఇప్పటివరకు గృహ కార్మికులు మొత్తం 560 మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. జూన్ 16వ తేదీన అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించామన్నారు.

వార్డు కార్యాలయాల్లో సమస్యల పరిష్కారం

వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య



వెస్ట్ జోనల్ కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశం

గచ్చిబౌలి: డివిజన్లలో నెలకొన్న సమస్యలను ఇకపై వార్డు కార్యాలయాల్లోనే సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య పేర్కొన్నారు. గురువారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆలోచనతో ప్రజల వద్దకు పాలన అనే నినాదంతో వార్డు కార్యాలయాల్లోనే సమస్యలను పరిష్కరించేందుకు 10 విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, జలమండలి, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్, ట్రాన్స్ కో తదితర విభాగాల అధికారులు వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉండనున్నారు. వార్డు స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ జాయింట్ సీపీ మల్లారెడ్డి, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, పూజిత గౌడ్, సింధూ రెడ్డి, ఉప కమిషనర్ వెంకన్న, సుధాంష్, రమేష్ , ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట దోచుకుంటున్నారు



మక్తమహబూబ్‌పేట్‌లో పర్యటిస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్

మియాపూర్: చెరువులను అభివృద్ధి చేస్తామని తూములను మూసివేయించి వెంచర్లు వేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు సంపాదిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. రవికుమార్‌యాదవ్ అన్నారు. మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట్ గ్రామంలో 55వ రోజు గడప గడపకు బీజేపీ పాదయాత్రను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువులో కలిసిన మురుగు కారణంగా మక్త గ్రామవాసులు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా ప్రక్కనే డంపింగ్ యార్డు వల్ల దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తాం

నిజాంపేట్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బ్యాగ్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం ఆయన నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి సాయినగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విధానాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తామన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులకు గురువారం కార్పొరేటర్ పుష్పనగేష్ అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయమై ఇళ్లలోకి నీరు చేరుతుందన్నారు.

నిధులు మంజూరు చేయండి

భారతీనగర్ డివిజన్ పరిధిలోని కాలనీలలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి గురువారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శంకరయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలో వార్డు కార్యాలయాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కాగా నిధుల మంజూరుపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మహిళా భవనం ప్రారంభం



మహిళ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: మహిళల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట కాలనీలో రూ.17.50 లక్షలతో నూతనంగా నిర్మించిన మహిళ భవనాన్ని కార్పొరేటర్ మంజులరఘునాథ్‌రెడ్డి తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారితకు ప్రభుత్వం కృషి చేస్తోంద న్నారు. కార్యక్రమంలో వేముకుంట కాలనీవాసులు, మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

● ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మానసిక ప్రశాంతత కోసం ప్రతీ ఒక్కరు భక్తి భావం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్ చెరు మండలం భానూరు గ్రామంలో నిర్వహించిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శాంతయ్య, డీఎల్ సీఐ వినాయక్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


వాంతులు చేసుకుని చిన్నారి మృతి

పటాన్‌చెరు టౌన్: అకస్మాత్తుగా ఓ చిన్నారి మృతి చెందింది. పటాన్‌చెరు ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌నకు చెందిన అంజమ్మకు ఎనిమిదేళ్ల క్రితం దుర్గేష్‌తో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మూడేళ్ల కిందట అంజమ్మ పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామం వడ్డెర కాలనీకి వచ్చింది. అమ్మగారి ఇంటి పక్కనే పిల్లలతో కలిసి ఉంటూ కూలి పనులకు వెళుతోంది. సోదరుని భార్య ప్రసవం కావడంతో ఈనెల 14వ తేదీన పిల్లలను పక్కనే ఉంటున్న తల్లి మల్లమ్మ వద్ద వదిలిపెట్టి నిలోఫర్ ఆస్పత్రికి వెళ్లింది. అంజమ్మ రెండో కూతురు సుష్మిత(5) బుధవారం రాత్రి భోజనం తిన్న తర్వాత వాంతులు చేసుకొంది. గురువారం తెల్లవారుజామున నీరు తాగిద్దామని సుష్మితను అమ్మమ్మ లేపగా లేవలేదు. దీనితో అంజమ్మ సోదరుడు ఎల్లేష్, మరో సోదరుడు రమేష్‌లు చిన్నారిని స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించారు. వారి సూచన మేరకు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూమి విషయంలో మోసం.. రెండేళ్ల జైలు, రూ.5వేలు జరిమానా

మియాపూర్: భూమి విషయంలో చీటింగ్ చేసిన వ్యక్తికి కూకట్‌పల్లి 8వ అదనపు మెట్రో పాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానాను గురువారం విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..హాఫీజ్‌పేట్‌కు చెందిన షేక్ ఫరీద్ (40) ఓ ప్లాట్ విషయంలో జీపీఏ చేసి స్థల యాజమానికి తెలియకుండా రద్దు చేసి మరో వ్యక్తికి జీపీఏ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్లాట్ యాజమాని 2017 లో మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి విచారణ జరిపి కోర్టులో షేక్ ఫరీద్ చార్జ్ షీట్ నమోదు చేశారు. 8వ అదనపు మెట్రో పాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పృథ్వీరాజ్ సాక్షులను విచారించి నిందితుడైన షేక్ ఫరీద్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



మియాపూర్: చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అహ్మద్ పాషా తెలిపిన ప్రకారం మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట్ చెరువులో ఓ మహిళ మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు గురువారం ఉదయం సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చెరువులో నుండి మృతదేహాన్ని బయటికి తీసి పరిశీలించారు. స్థానికులను ఆరా తీయగా ఏ సమాచారం లభ్యం కాలేదు. మహిళకు (30–35) సంవత్సరాలు ఉంటాయని, ఆమె చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందా..? లేదా ఎవరైనా హత్య చేసి చెరువులో పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

తల్లి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: తల్లి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు చేశాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం...హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన ప్రవీణ్ కుమార్ ప్రైవేటు ఉద్యోగి. కాగా ఇతడి తల్లి సుజాత(65) 14వ తేదీ బుధవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద, వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన తల్లి అదృశ్యమైందని కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూతురి అదృశ్యంపై తండ్రి ..

తన కూతురు అదృశ్యమైందంటూ ఓ తండ్రి ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరుకు చెందిన ఎండీ ఫయాజ్ కార్పెంటర్. ఆయన కూతురు సనా ఫాతిమా ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 14వ తేదీ బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటికి వెళ్లిన సనా ఫాతిమా తిరిగి రాలేదు. దీంతో కూతురు కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తమకు ఓ వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనాన్ని ఓ కారు ఢీకొంది. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం. దుండిగల్ మండలం శంబీపూర్ గ్రామానికి చెందిన క్యాసారం సత్తయ్య అమీన్‌పూర్ పరిధిలోని ప్రణీత్ నైట్‌ఉడ్స్‌లో జేసీబీ నడుపుతున్నాడు.ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ శంబీపూర్ నుంచి బైక్‌పై వస్తుండగా ప్రణవ్ హోమ్స్ సమీపంలో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్తయ్యకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సత్తయ్య కుమారుడు క్యాసారం భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముందున్న కారును ఢీకొట్టి బోల్తా..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముందు వెళుతున్న కారును వెనుక నుంచి ఢీకొట్టిన కారు బోల్తా పడింది. పోలీసులు కథనం ప్రకారం.. చింతల్‌కు చెందిన సాయికుమార్ గురువారం ఇన్నోవా కారులో శంషాబాద్ నుంచి మేడ్చల్‌కు ఓఆర్ఆర్‌పై వెళుతున్నాడు. కొల్లూర్ వద్దకు రాగానే సాయికుమార్ కారును వెనుక నుంచి మహారాష్ట్రకు చెందిన ఎస్‌క్రాస్ కారు ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో ఎస్‌క్రాస్ కారులో ఉన్న అజిత్, రాజశ్రీలు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో..

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం.. గుల్బర్గాకు చెందిన వడ్డె గౌరమ్మ –సుభాష్ దంపతులు 3సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గండిగూడెం వద్ద ఉంటున్నారు. సుభాష్ మేస్త్రి పని చేస్తుండగా, మొహంపై ఎలర్జీ రావడంతో బంధువుల శుభకార్యాలకు వెళ్లేవాడు కాదు. అయితే మూడు రోజుల క్రితం గుల్బర్గాకు భార్య గౌరమ్మ వెళ్లగా సుభాష్ ఇంటి వద్ద ఉన్నాడు. ఈ క్రమంలో తిరిగి గౌరమ్మ 14వ తేదీ మధ్యాహ్నం ఇంటికి రాగా అప్పటికే మద్యం సేవించి సుభాష్ పడుకొని ఉన్నాడు. అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు బయటకు వెళ్లిన సుభాష్ తిరిగి రాలేదు. రాత్రి గండిగూడ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.